విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకే సీపీఐ, సీపీఎం విస్తృత ప్రచారం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: బిజెపి ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై సీబీఐ చేత కేసులు పెట్టించి బెదిరించడం, జాతి సంపదలు కారు చౌకగా గుజరాత్ కు చెందిన అంబానీలకు అప్పజెప్పడం, జాతీయ బ్యాంకులలో వారు తీసుకున్న రుణాలను మాఫీ చేయటం వంటి కార్యక్రమాలు తప్ప దేశ ప్రజలకు సంబంధించిన అభివృద్ధి ఏమాత్రం లేదని జగదీష్ అన్నారు. కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారం చేపట్టిన నాటి నుండి దేశంలో రాజ్యాంగ విలువలు పూర్తిగా విస్మరించిందని కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను కుదించిందని జాతీయ బ్యాంకులను తమ ఇష్టానుసారంగా ఒకదానిలో ఒకటి కలుపుతూ దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా కుంటుపడే విధంగా చేసిందని ఆయన విమర్శించారు. దానికి తోడు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశంలోని ప్రజలను విభజించి పాలిస్తోందని జగదీష్ పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గడుతూ 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని ప్రతి మండలంలోని గ్రామ గ్రామాన ప్రజలకు తెలియజేస్తూ విస్తృతంగా ప్రచారం చేపట్టాలని తద్వారా ఆందోళన కార్యక్ర మాలను నిర్వహిస్తామన్నారు. ఈరోజు దేశ సంపదను దోచుకున్న అదాని పై విచారణ చేపట్టాలని 16 ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీ నోరు మెదపలేదని అందుకే సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో 'దేశ్ కి బచావో నరేంద్ర మోడీ హటావో' అని పిలుపు నిచ్చామని జగదీష్ అన్నారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా లక్షల కోట్ల రూపాయలు అప్పుచేసి రాష్ట్రాన్ని దివాలా తీసే విధంగా చేసిందన్నారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎన్నికలలో వచ్చిన ఫలితాలను బట్టి చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధమయ్యారని అందుకు నిదర్శనం పట్టభద్రుల ఎన్నికల ఫలితాలు అని ఆయన పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలనలో దేశ సంపదను గుజరాత్‌కు చెందిన కార్పొరేట్ వ్యాపారులకు దోచిపెడుతోందని దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి నిరసనల కార్యక్రమాలలో భాగంగా ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాలలో మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో ప్రచారం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేంద్ర సాయి, మాల కొండయ్య, సురేష్, సిరాజ్,మధు, నంది పోగుల రమణయ్య, షాన్వాజ్, నందయ్య, యాట సీనయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీఐ నెల్లూరు జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈనెల14వ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు విస్తృతంగా సిపిఎం తో కలిసి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఏప్రిల్ 23వ తేదీ ఎల్లాయ పాలెంలో జరగనున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభను జయప్రదం చేసేందుకు అందరూ సమిష్టిగా కృషిచేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి డి జగదీష్, జిల్లా కార్యదర్శి దామ అంకయ్య పిలుపు నిచ్చారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గృహ నిర్బంధం

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పోలీసులు గురువారం గృహ నిర్బంధం చేశారు. ఆయన చేపట్టనున్న జలదీక్షను అడ్డుకునేందుకు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పొట్టి పాలెంకలుజు వలన కలిగే నష్టం ఒక్క నెల్లూరు రూరల్ నియోజకవర్గ మనకే కాదు ఇది నెల్లూరు జిల్లాలోని దాదాపుగా సగం జిల్లా దని అన్నారు. జిల్లాలోని ప్రజలు నిత్యం ఈ దారి గుండా ప్రయాణి స్తుంటారు.. అక్కడ జరిగే ప్రమాదాలు నివారించడానికి కోసమే బ్రిడ్జి నిర్మాణం చేపట్టమని ఆరోజు జగన్మోహన్ రెడ్డి అడిగానని, అని అందుకు ఆయన అలాగే అని చెప్పి దానికి నిధులు మంజూరు చేస్తారని నాకు హామీ ఇచ్చారని, స్వయంగా తీసుకెళ్లి చూపించి తానే అడిగాను.. నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఆ రోజు నుంచి దీనిపైన అధికారుల, మంత్రుల దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నాను. నెల్లూరు గ్రామీణ సమస్యలు నేను ఇప్పుడు మాట్లాడటం లేదునాలుగేళ్ల నుంచి మాట్లాడుతున్నా.. చెప్పులు అరిగెలా కాళ్లకు నొప్పులు వచ్చేలా పెద్దలు వద్దకు తిరిగా. పరిష్కారం కాలేదు. 3సంవత్సరాల 11నెలలుగా పొట్టిపాలెం, ములుముడి అడిగా అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రికి చూపిం చా. అడుగు ముందు కు పోలేదు. నాలుగు నియోజక వర్గాల సమస్య ఇది. పొట్టిపాలెం కలుజు వద్ద 8గంటలు జలదీక్షకు పూనుకున్న. 10రోజుల కిందట అనుమతి కోసం పోలీస్ యంత్రాంగానికి స్వయంగా నేనే లెటర్ పంపించాను . అయితే ఉదయం ఎనిమిది గంటలకు నిన్న దీక్ష చేపడు తున్నానని బహిరంగంగానే ప్రకటించాను పోలీసు ఉన్నతా ధికారులు అంతర్జాతీయ తీవ్రవాదిని అన్నట్లుగా తెల్లవారుజామున నాలుగు గంటలకే నా ఇంటి చుట్టూ ముట్టడి చేయడం నేను ఉండే ప్రాంతమంతా పోలీసులు వలయంగా ఏర్పడి. అన్యాయంగా హౌస్ అరెస్ట్ చేశారు. ఎందుకు నన్ను నిర్బంధించారు? అని అడగగా దానికి పోలీస్ అధికారులు ఇచ్చిన సమాధానం మీరు దీక్ష చేసేటప్పుడు అక్కడ లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు మర బోట్లు లేవని అందుకని మీకు అనుమతి మంజూరు చేయలేదని వారు తెలి పారు. అయితే పోలీసు అధికారులకు నేను ఇచ్చిన లెటర్ పైన సందేహాలు ఉండి ఉంటే అడిగి నివృత్తి చేసుకోవచ్చు కానీ అలా కా కుండా ఇప్పటికి ఇప్పుడు దీక్షకు అనుమతి లేదు అని అన్నాను.. అవసరం చేయడం ఎంతవరకు సమంజసం అని శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. దీంతో ఇంటివద్దే దీక్షను చేపట్టారు. పోలీసు లు ఇంటి వద్ద ఉన్నంతవరకు దీక్ష చేపడతానని శ్రీధర్ రెడ్డి తెలిపారు. నేను చేస్తున్న ఈ పోరాటానికి సిపిఐ, జనసేన, సిపిఎం, బిజెపి, టిడిపిలే కాక పలు ప్రజా సంఘాల వారు కూడా వచ్చి నాకు మద్దతు తెలిపారు. వారందరికీ కూడా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని శ్రీధర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి సంతకానికి విలువ లేదంటే ఈ రాష్ట్రంలో ఏమి జరుగు తుందో ప్రజలే చెప్పాలి అన్నారు. ఇంటి స్థలాల్లో వసతులు లేవు. వావిలెటిపాడు లేఅవుట్ ఒక్క సారి చూడండన్నారు. నేను చెప్పే మాటల్లో స్వచ్ఛత ఉంటే అందరూ మద్దతు ఇవ్వండి..రోడ్డు సమస్యలు పరిష్కారం కాలేదు.. పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వండి.. కొమరపూడి లిఫ్ట్ఇరిగేషన్‌కు ముఖ్యమంత్రి సంతకానికి దిక్కులేని పరిస్థితి..అడిగినా పరిష్కారం కాలేదు. ఉద్యమించా.. తప్పా చెప్పండి.అమరావతిలో కూడా గాంధీగిరిలో నిరసనలు తెలుపుతాను.. అని శ్రీధర్ రెడ్డి అన్నారు.

ఎమ్మెల్యే గృహనిర్బంధంపై బీజేపీ ఖండన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ స్వతంత్ర ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పొట్టే పాలెం కలుజు కోసం చేయనున్న జల దీక్షను భగ్నం చేసేందుకు ఎమ్మెల్యేను గృహ నిర్బంధం చేయడాన్ని బిజెపి జల సంరక్షణ రాష్ట్ర ప్రముక్ మిడతల రమేష్ ఖండించారు. దాదాపు 40 గ్రామాల ప్రజలకు అవసరమైన వారధిని ప్రారంభించ మని రమేష్ డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా వారాధి నిర్మాణం కోసం బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2019 జూలై నెలలో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిశీలించమని సంతకం చేసిన అభివృద్ధి పనులు కూడ ప్రారంభం కాలేదంటే అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుందని రమేష్ తెలిపారు.

తెల్లరాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- ప్రభుత్వ భూముల్లో తెల్లరాయి అక్రమ తరలింపు- క్వారీలను పరిశీలించిన ఆర్డిఓ
- రెవెన్యూ అధికారులపై ఆగ్రహం - అక్రమ తెల్ల రాయి తవ్వకం దారులకు లక్ష ఫైన్

విశాలాంధ్ర -అనుమసముద్రంపేట: ప్రభుత్వ భూముల్లో తెల్ల రాయి అక్రమ తవ్వకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఆర్‌డిఓ కరుణకుమారి హెచ్చరించారు. ఏఎస్పేట మండలం చౌట భీమవరం గ్రామంలో ఇటీవల తెల్లరాయి అక్రమంగా తరలిస్తున్న ముఠాను ఆ గ్రామ ప్రజలు పట్టుకొని అధికారులకు సమాచారం ఇచ్చి వాహనాలు స్వాధీనం పరిచిన విషయం విదితమే. అయితే స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి, మండల అధికారులు తెల్ల రాయి తరలింపు దారులపై చర్యలు తీసుకోలేదని మొక్కుబడిగా చర్యలు తీసుకుంటున్నారని ఆ గ్రామ ప్రజలు జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన ఆయన ఆత్మకూరు ఆర్‌డిఓ కు, ఏఎస్‌పేట తహశీల్దారుకు అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోవాలని నివేదిక పంపాలని ఆదేశించి నట్లు తెలుస్తోంది. ఆ మేరకు ఆత్మకూరు ఆర్డీవో కరుణకుమారి గురువారం చవట భీమవరం గ్రామంలో అక్రమంగా తెల్లరాయి తవ్విన క్వారీలను తహశీల్దారుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏళ్ల తరబడి గ్రామం లో ప్రభుత్వ భూములలో తెల్లరాయి తరలిస్తున్నా గ్రామ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని వారికి సహకరిస్తున్నారని గ్రామస్తులు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. తరచుగా తెల్లరాయి తరలిస్తుంటే ఏం చర్యలు తీసుకున్నారని ఆర్డిఓ వీఆర్వో పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ మళ్లీ తవ్వకాలు జరక్కుండా ప్రతిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో తవ్వకాలు జరగకుండా గ్రామస్తుల సహకారంతో రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ అధికారుల సమిష్టి పర్యవేక్షణలో చర్యలు చేపడతామన్నారు. త్వరలో పై శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి గట్టి చర్యలు చేపడతామని తెలిపారు.

అన్నదాతలకు అండగా క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ: ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అన్నదాతలకు అండగా ఉంటున్న క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలను కాపాడు కోవాలని, కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఇందుకూరుపేట క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన గోదాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ ఇందుకూరుపేట క్రెడిట్ కో-పరేటివ్ సహకార సంఘం గోదాం శిథిలావస్తుకు చేరుకున్న కారణంగా, మండల రైతులు ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో, 40 లక్షల రూపాయల వ్యయంతో నూతన గోదాంను ఏర్పాటు చేసుకోవడం జరిగిం దన్నారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో, అటు ప్రజలు, ఇటు రైతులు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజల బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. రానున్న 2024ఎన్నికల్లో కూడా, మరల వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్, మండల క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, వైసీపీ మండల యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కైలాసం శ్రీనివాసులు రెడ్డి మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గృహ సారథుల అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఉలవపాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉలవపాడు మండలం ఉలవపాడు గ్రామ సచివాలయం 1,2,3 పరిధిలో శాసనసభ్యులు మహీధర్ రెడ్డి సూచనతో ఉలవపాడు మండలం కన్వీనర్ వెలిచెర్ల ధనకోటి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల అవగాహన సదస్సు నిర్వహించారు. మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆంధ్ర రాష్ట్ర ప్రజల భవిష్యత్తు క్షేమకరంగా బాగుండాలంటే పార్టీని అందరు క్షేత్ర స్థాయిలోబలోపేతానికి కృషి చేయాలని కోరారు. కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మహీదర్ రెడ్డి గతం కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ఆశించిన విధంగా 175/175 సాధించాలి కోరారు.ఈ లక్ష్యాన్ని సేదించాలంటే కార్యకర్తలు నాయకులు సచివాలయ కన్వీనర్లు క్రమశిక్షణతో పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ వెలిచర్ల ధనకోటి మండల అధ్యక్షులు వెలిచెర్ల చంద్రశేఖర్, ఎంపీటీసీ లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మానమ్మకం నువ్వే జగన్‌లో పార్టీ నేతలు పాల్గొనాలి

- ఎంపీ ఆదాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఈ నెల 7వ తేదీన ప్రారంభం కానున్న "మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పార్టీలోని అన్ని వర్గాల నేతలు పాల్గొనా లని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఆయన తన నివాసంలో "మా నమ్మకం నువ్వే జగన్' పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వాలంటీర్లు గృహ సారథులు, వైసిపి నేతలు అందరూ పాల్గొంటారని తెలిపారు. వీళ్ళందరూ కలిసి ప్రతి ఇంటికి వెళ్లి పరిపాలన ఎలా సాగుతుందో, జగనన్న మీద వాళ్ల అభిప్రా యం ఏమిటి? అనే విషయాలను తెలుసు కుంటారని చెప్పారు. 10 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రస్తుత నేపథ్యంలో, ప్రతి ఇంటికి వెళితే ఆ కుటుంబ సభ్యులు ఎంతో సంతోషపడతారని, సీఎం జగన్మోహన్ రెడ్డి తమకు చెప్పారని తెలిపారు. ఇదే విషయాన్ని నాయకులు, కార్యకర్తలకు వివరించామన్నారు. ఇది పూర్తిగా విజయ వంతంగా కొనసాగుతుందని నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు అవినాష్, ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, శరశ్చంద్ర, వైసీపీ నేతలు మదన్మోహన్ రెడ్డి, మేఘనాథ్ సింగ్, పిండి సురేష్, మొయిళ్ళ సురేష్ రెడ్డి, హరిత, భార్గవి రెడ్డి, జ్యోతి పా ల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి క్యాంప్ కార్యా లయంలో జగనన్న మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ వాల్ పోస్టర్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పార్లమెంటు సభ్యులు నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణ వెంకయ్య, జడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు మోయిళ్ళ సురేష్ రెడ్డి, నెల్లూరు మధన్ మోహన్ రెడ్డి, కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యురాలు హూరియా, పేర్నాటి కోటేశ్వర్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, హరిబాబు యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను జయప్రదం చేయండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కందుకూరు: 'జగనన్నే మా భవిష్యత్తు'ను జయప్రదం చేయాలని మాను గుంట మహీధర్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక వైయస్సార్ సిపి కార్యాల యంలో విలేకరుల సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభమవుతుందని జెసిఎస్ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 20వ తేదీ లోపు నియోజకవర్గంలోని పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ పోస్టర్ ను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని జెసిఎస్ కన్వీనర్లు, పట్టణ వైసీపీ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు పట్టణ జెసిఎస్ కన్వీనర్ ముప్పవరపు కిషోర్, గణేశం గంగిరెడ్డి, తోకల కొండయ్య, కొండూరి వసంతరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మనుబోలు ఇన్‌చార్జి తహశీల్దార్ గా కృష్ణ

విశాలాంధ్ర:- మనుబోలు: మనుబోలు ఇంచార్జ్ తహశీల్దారుగా వెంకటాచలంలో విధులు నిర్వహిస్తున్న కృష్ణను జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన గురువారం మనుబోలు తహశీల్దార్ కార్యాలయానికి ఇచ్చేసి తమ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో వీఆర్ఏలు కార్యాలయం సిబ్బందికి సూచన లు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు బాలకోటమ్మ, సీనియర్ అసిస్టెంట్ అమీర్ భాష ,వీఆర్వోలు నాగార్జున రెడ్డి భక్తవత్సల రెడ్డి, అఖిల్, బుజ్జయ్య శ్రీనివాసులు, భగవాన్, నాగేశ్వరరావు, సీనమ్మ, మండల సర్వేరు గోపికృష్ణ, సచివాలయం సర్వేలు మధు, శివ, వంశీకృష్ణ, విఆర్ఏలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేరు శనగ సాధారణ దిగుబడి: సీపీవో

విశాలాంధ్ర-ముత్తుకూరు: ముత్తుకూరు మండలంలో రైతులు వేసిన వేరుశనగ పంట సాధారణ దిగుబడులు వచ్చాయని జిల్లా సిపిఓ సాల్మన్ రాజు తెలిపారు. గురువారం మండలంలోని బోడి స్వామి వారి కండ్రిగ వద్ద హరీష్ రెడ్డి వేసిన వేరుశనగ పంట లో పంట కోత ప్రయోగాన్ని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది గ్రామస్థాయి లో వేరుసెనగ, వరి పంటలను పంటకోత ప్రయోగం చేయడం జరుగుతుందన్నారు. ఖరీఫ్, రబి సీజన్లో ఈ ప్రయోగాలను చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే వేసవిలో రైతులు వేసిన వేరుశనగ పంటను పంట కూత ప్రయోగం ద్వారా సేకరిస్తు న్నామన్నారు. క్షేత్రస్థాయిలో పంట దిగుబడి ఎంత వచ్చిందో తెలిస్తే, జిల్లాస్థాయిలో పండ దిగుబడులు ఎంత వచ్చాయి, రాష్ట్రస్థాయిలో ఏ మేరకు వచ్చాయి, జాతీయ స్థాయిలో ఎంత మేర పంట దిగుబడులు వచ్చాయో తెలుస్తుందన్నారు. హరీష్ రెడ్డి పొలంలో 5/5 విస్తీర్ణంలో వేరు సెనగ పంటను పీకి కాయలు వలిచి తూకంవేయగా 18 కేజీల 500 గ్రాములు దిగుబడి వచ్చిందని ఈ విధంగా దిగుబడి రావడం వల్ల రైతుకు లాభసాటి గానే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఓ శోభారాణి, మండల ఏ ఎస్ ఓ వాసుదేవరావు, గ్రామ సచివాలయ వ్యవసాయ నాయకులు చందన, జగదీష్ , నవీన్ లు పాల్గొన్నారు.

అంగడిని కూలగొట్టారు..

విశాలాంధ్ర-ముత్తుకూరు: తన అంగడిని యంత్రాల సహాయంతో కూలగొట్టి 13 లక్షలు నష్టం వాటిల్లేలా చేశారని బాధితుడు రిజ్వాన్ తెలిపారు. గురువారం సంఘటనా స్థలం వద్ద ఆయన విలేకరులతో మాట్లా డుతూ ముత్తుకూరు బస్టాండ్ సెంటర్లోని తన కూల్‌డ్రింక్స్ షాపును కుప్పం నరసింహారావు, పామంజి నాగరాజు యంత్రాల సహాయంతో బుధవారం అర్ధరాత్రి పడగొట్టారన్నారు. ఈ విషయంపై గత రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కూల్ డ్రింక్స్, ఫ్రిజ్‌లు, 2 లక్షల రూపాయల నగదు షాపులో ఉందని అయితే ప్రస్తుతం కనిపించడం లేదని ఆయన తెలిపారు. ఈ విషయంపై షాపు యజమాని కుప్పం నరసింహారావు విలేకరులతో మాట్లాడుతూ తాను సుమారు 30 సంవత్సరాల క్రితం రిజ్వాన్ కు అద్దెకు షాపును ఇచ్చానని, అయితే గత 20 ఏళ్ల క్రితం దాన్ని ఖాళీ చేయాలని తాను కోరగా తాను కోర్టుకు వెళ్లానన్నారు. ఇటీవల కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇస్తూ ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఇచ్చిందన్నారు. ఈ ఆర్డరును పోలీసులకు చూపించగా త్వరలో ఖాళీ చేయించి ఇప్పిస్తామని చెప్పారని ఆయన తెలిపారు. అయితే పోలీసులు ఖాళీ చేసి తనకు ఎక్కడ ఇస్తారన్న దుర్బుద్ధితో బుధవారం రాత్రి రిజ్వానే సరుకులు అన్నింటిని ఇంటి వద్దకు మార్చుకొని యంత్రాల సహాయం తో షాపును కూలగొట్టాడని దీనిపై తనకు ఎలాంటి ప్రమేయం లేదని ఆయన తెలిపారు.

టిసిఎస్‌కు ప్రకాశం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-కందుకూరు: కార్పొరేట్ రంగంలో ఈ ఏడాది ఉద్యోగ నియామకాల సంక్షోభం నెలకొని ఉన్నా ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు పలువురు టి.సి.ఎస్ కు ఎంపికై ప్రతిభను చాటుకున్నారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య సాంకేతిక డైరెక్టర్ డాక్టర్ కే.విజయ శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. టీ.సి.ఎస్ తో పాటు డిలాయిట్ కంపెనీకి కూడా ఒక విద్యార్థి ఎంపిక కావడం తమ కాలేజీ సమర్థతకు తార్కాణమన్నారు. టిసిఎస్ కు ఎంపికైన వారిలో ఒక విద్యార్థి 7 లక్షల రూపాయల వార్షిక వేతనం క్యాటగిరిలో ఉండడం తమకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. తొలి విడతలో 15 మంది టిసియస్ కు ఎంపిక కాగా, మరో 10 మంది విద్యార్థులు వివిధ దశల అనంతరం ఫైనల్ గా ఎం.ఆర్ ఇంటర్వ్యూ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ పేర్కొన్నారు. వారు కూడా టీ.సి.ఎస్ లో ఉద్యోగాల పొందగలరనే ఆశా భావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ప్రత్యేక శిక్షణ: సంక్షోభ నివారణ ముగిసిన అనంతరం పలు సాఫ్ట్వేర్ కంపెనీలు ఉద్యోగాలు ఎంపికకు రంగ ప్రవేశం చేసే అవకాశాలు దక్కించుకునేందుకు ప్రణాళిక రూపొందించామని వారు వెల్లడించారు. కార్పొరేట్ రంగంలో ఉద్యోగాల ఎంపికకు శిక్షణ ఇవ్వడంలో సిద్ధహస్తులైన శిక్షకులతో 11 రోజులు పాటు ప్రత్యక్ష శిక్షణ ఇప్పించా మన్నారు. టెక్నికల్ సపోర్ట్ జాబ్స్ కు క్యాంపస్ ఇంటర్వ్యూల నిర్వహణ రంగ సిద్ధం చేస్తున్నామన్నారు. విప్రో, ఇన్ఫోసిస్, కేప్ జెమినీ తదితర కంపెనీల త్వరలో క్యాంపస్ ఇంటర్వ్యూ లు నిర్వహిస్తామన్నారు.

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అర్హతకలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు భవిష్యత్ లో ప్రతి గ్రామం సంపూర్ణంగా, సమగ్ర అభివృద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం, కురిచర్లపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాడు నేడు కార్యక్రమం క్రింద మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 20.23 లక్షల రూపాయలతో చేపట్టిన మౌలిక వసతులను మంత్రి ప్రారంభించారు. తొలుత మంత్రి గ్రామంలోని ఆది లక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, వివిధ పథకాల కింద వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో అర్హత కల్గిన ప్రతి పేద కుటుం బానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని అన్నీ నియోజక వర్గాల్లో గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోవడంతో పాటు, ఏదైనా సాంకేతిక కారణాల వలన అర్హత వుండి సంక్షేమ పథకం అందని లబ్ధిదారునికి అందించడం, గ్రామ ప్రజల కోరిన గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను చేపడు తున్నా మన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని మంత్రి తెలిపారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో ఈ గ్రామంలో 2 కోట్ల రూపా యలతో సైడు కాలువల నిర్మాణాలు, 75 లక్షలతో సిమెంట్ రోడ్లను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రైతాంగానికి అండగా వుంటూ రైతుల సంక్షేమమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. నేడు రైతులు గిట్టుబాటు ధర లభించి సంతోషంగా ఉన్నారన్నారు. రెండో పంటకు సాగునీరు ఇవ్వడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల సంపూర్ణ, సమగ్ర అభివృద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాల రాకతో నెల్లూరు రూరల్‌లో చైతన్యం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అభివృద్ధికి మరో పేరు ఆదాల ప్రభాకర్ రెడ్డి.. ఆయనకు ఉత్తినే మాట్లాడటం చేతకాదు.. ఆయన చేతలే మాట్లాడుతాయి.. అందుకే ఆదాల ఎక్కడుంటే అక్కడ చైతన్యం ఉంటుంది.. అభివృద్ధి ఉంటుంది.. నెల్లూరు ఎంపీగా పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్న అడగని రోజు ఉండదు. అది స్థానికమా, రాష్ట్ర పరిధా, కేంద్ర స్థాయిలోనిదా అన్నది ఆ సమస్య పరిస్థితిని బట్టి ఉంటుంది. ఇంతలో అధిష్టానం నెల్లూరు రూరల్ నియోజకవర్గం బాధ్యత ఆయనపై మోపింది. దాన్ని ఆయన సవాలుగానే తీసుకున్నారు. ఇక చక చకా తన కార్యాచరణ ప్రణాళికను ప్రారం భించారు. అందులో భాగంగా నెల్లూరు రూరల్ పరిధిలోని కార్పొరేటర్లతో వరుస సమావేశాలు నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులను రప్పించి వారితో మాట్లాడారు. తానే స్వయంగా కార్పొరేషన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో, కార్పొరేటర్లతో ఒక సమావేశాన్ని నిర్వహించి సమస్యల ప్రస్తావన చేశారు. వాటికి పరిష్కారాలు ఏమిటని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి నిర్దేశిత గడువును విధించారు. ఎప్పటికప్పుడు కార్పొరేటర్లతో, అధికారులను సమన్వయం చేస్తున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్నారు. వాటికి పరిష్కారాలను అధికారులతో చర్చిస్తున్నారు. ముఖ్యంగా కొత్తగా ఉత్పన్నమైన సమస్యలు పరిష్కరిం చేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నారు. ములుముడి- కందుమూరు రోడ్డు నిర్మాణానికి 8 కోట్ల రూపాయలను ప్రకటించారు. అందుకు ఆరు నెలల గడువును కూడా విధించారు. చిన్నాచితక సమస్యలకు అతి త్వరలో పరిష్కారం ఇచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నారు. ఇందుకు అధికారు లను కూడా అప్రమత్తం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సమస్యలు ఉండరాదనే లక్ష్యంతో ముందుకు పోతున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం లో ఇప్పుడు ఒక కొత్త వాతావరణం నెలకొంది. తమ సమస్యలకు పరిష్కారం చూపే నేత తమ ముందుకు వచ్చాడనే సంతోషం నేతల్లో కనిపిస్తోంది. అభివృద్ధి చేయడంలో అధికార పక్షం, విపక్షం ఆదాల చూడరని స్థానిక సమావేశాల్లో నేతలు చెబుతున్నారు. గతంలో తాము విపక్షంలో ఉన్నప్పుడు కూడా సహాయం చేశారని ఆదాల ప్రభాకర్ రెడ్డిని కొనియాడుతున్నారు. దీంతోపాటు వైసీపీ అధిష్టానం నిర్దేశించిన పార్టీ కార్యక్రమాలను ఆదాల ముందుకు తీసుకెళ్తున్నారు. ఎక్కడ సమన్వయ లోపం లేకుండా చూస్తున్నారు. ఇది పార్టీ వర్గాల్లోనూ హర్షాన్ని నింపింది.

సమస్య తీరే వరకు పోరాడుతా: ఉన్నం నళిని దేవి

విశాలాంధ్ర - ఉలవపాడు: మండలంలోని సుబ్బరాయుడు సత్రం గ్రామం రైల్వే గేటు వద్ద గ్రామస్తులు జరుగుతున్న నిరసన శిబిరం ఆరవ రోజుకు చేరింది. ఇందులో భాగంగా గురువారం బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉన్నం నళినీ దేవి నిరసన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే అండర్ పాస్ నిర్మించడానికి ప్రజాభిప్రాయం సేకరించకుండా ఏకపక్ష వైఖరితో మండల తాసిల్దార్ ఆర్డీవో సంతకాలు చేయడం గ్రామ ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఈ రైల్వే పాస్ నిర్మాణం పూర్తయితే తుఫాను సమయాలలో ఎగువ నుండి వచ్చే వరద నీరు ఈ అండర్పాస్ ద్వారా ప్రవహిస్తుందని దీని ప్రభావంతో లోతట్టు ప్రాంతమైన సుబ్బరాయుడు సత్రం గ్రామం పూర్తిగా జలమయమై పోతుందని తెలిపారు. సంబంధింత అధికారులు పై విషయాలను దృష్టిలో ఉంచుకొని అండర్ పాస్ నిర్మించే ప్రయత్నాలను నిలుపుదల చేయాలని ప్రజల సౌకర్యం కోసం పై వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను రైల్వే డిఆర్ఎం, కలెక్టర్ దృష్టి కి తీసుకువెళ్లి సుబ్బ రాయుడు సత్రం గ్రామ ప్రజలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటా మని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలతో పాటు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొ న్నా రు. ఇప్పటికే టిడిపి నాయకులు ఇంచార్జి నాగేశ్వరరావు ప్రజా సంఘాలు పాల్గొని గ్రామస్థులు కు మద్దతు తెలిపారు. ఈ ప్రభావం తో సమస్య మరింత జఠిలం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామస్థులు కూడా తమకు అన్యాయం చేసిన వారికి తమ గ్రామం ని ముంపుకు గురిచేసే విధంగా చర్యలు చేపట్టిన వారిని ఎదుర్కొని గ్రామం ని రక్షించుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈ పోరాటంలో నిస్వార్థ గ్రామ స్థులు గ్రామానికి మేలు చేకూరేలా ఫ్లై ఓవర్ సాధిస్తారో అధికారులు పంతం నెగ్గించుకుంటారో వేచి చూడాలి.

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి సిపిఐ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జిల్లాలోని అత్యధిక భాగం ప్రజలకు అవసరమైన ప్రజా సమస్యపై చేస్తున్న పోరాటాన్ని దెబ్బతీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం తెల్లవారుజామున ఆయన ఇంటి వద్ద హౌస్ అరెస్ట్ చేయ టాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ అన్నారు. నెల్లూరు జిల్లా సీపీఐ జిల్లా సమితి సమావేశానికి విచ్చేసిన జగదీష్ హౌసెస్ కాబడిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనని పరామర్శించి ఆయన చేస్తున్న పోరాటానికి సీపీఐ రాష్ట్ర సమితి తరఫున సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రతి పక్షాలను ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కొనలేక జీవో నెంబర్ ఒకటి తెచ్చి తద్వారా ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న వారందరినీ ఎక్కడికి అక్కడ అణగదొక్కి హౌస్ అరెస్టు చేసే విధంగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు తమ పోరాటం చేసేందుకు 'చలో విజయవాడ'ను చేపడితే ఎవరిని రానీకుండా ఎక్కడికక్కడ పోలీసులు అక్రమంగా కేసులు బనాయించి వారిని అరెస్టు చేయడం మంచిది కాదని ముఖ్యమంత్రిని జగదీష్ హెచ్చరిం చారు. రసంలో గత నాలుగు సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి జరగకపోగా ప్రతిపక్ష నాయకుల పైన, పత్రిక అధిపతుల పై, పాత్రికేయుల పై అన్యాయంగా, అక్రమంగా కేసులు బనాయిస్తూ వారిని వేధించటం లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తోందని ఆయన వాపోయారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పై విసిగి పోయారని ఎప్పుడెప్పుడు జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపిద్దామా? అని ఎదురు చూస్తున్నారని జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్ , నంది పోగు రమణయ్య, చిన్న అంకయ్య, శాన్వాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్, జిల్లా కన్వీనర్ మున్నా, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వి నాగేంద్ర , ఆదినారాయణ, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముక్తియార్ , ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే ఆదర్శం: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ధనికులకు మాత్రమే సాధ్యమయ్యే ఫ్యామిలీ డాక్టర్ విధా నాన్ని, సామాన్యులకు కూడా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహ న్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే ఆదర్శమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గురువారం ఉదయం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పల్నా డు జిల్లా నుంచి లాంఛనంగా ప్రారంభిం చగా, జిల్లాలో నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల గ్రామం నుంచిఎంపీఆదాల ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తో కలిసి మంత్రి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లా డుతూ పేదల ఆరోగ్యం గురించి ఆలోచన చేసి ఆరోగ్యశ్రీ పథకానికి మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి శ్రీకారం చుట్టారని, ఆయన మరణాంతరం ఆరోగ్యశ్రీ,104,108 పరిస్థితి దయనీ యంగా మారిందన్నారు. 2019లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత వైద్య ఆరోగ్యశాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. భారతదేశ చరిత్రలోనే నూటికి నూరు శాతం వైద్యులను భర్తీ చేసిన ఏకైక రాష్ట్రం మన రాష్ట్రమేనని, దేశ వ్యాప్తంగా 66 శాతం మాత్రమే వైద్యులు ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్నారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైద్యులకు ఎంత వేతనం కావాలో అంత వేతనం చెల్లిస్తూ, పేదల ఇంటి ముంగిటకే వైద్య సేవలను చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కే దక్కిందన్నారు. గ్రామాల్లో ఎంతోమంది వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఆసుపత్రికి వచ్చి వైద్యం చేసుకోలేని పరిస్థితి నుంచి, వారి వద్దకే వైద్యులు వెళ్లి వైద్య సేవలు అందించే బృహత్తర కార్యక్రమమే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అని మంత్రి స్పష్టం చేశారు. పేదవాడికి ఏం కావాలో తెలుసుకొని, వారి అవసరాలను గుర్తించి కార్యక్రమాలను అమలు చేస్తున్న పేదల పక్షపాతి ముఖ్యమంత్రి అని అన్నారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాలనలో అనేక మార్పు లకు శ్రీకారం చుడుతూ, గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని, గ్రామస్థాయిలోనే ప్రజలకు అన్ని వసతులు అందజేస్తు న్నట్లు చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు సులభతరం అయ్యాయని, రానున్న రోజుల్లో నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎంపీ ఆదాల ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తొలుత వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ను, 104 వాహనాలను మంత్రి, ఎంపీ ప్రారంభించగా, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమం వివరాలను, జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను

జిల్లా వైద్యాధికారి పెంచలయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, ఎన్డిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ ఆనం విజయ కుమార్ రెడ్డి, వైద్యులు రవీంద్రారెడ్డి, కవిత, ప్రమోద్, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ని ప్రజలందరూ సద్విని యోగపరచుకోవాలని కోవూరు గ్రామ సర్పంచ్ ఆవుల మాధవ రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు ప్రారంభమైన ఫ్యామిలీ ఫిజీషి యన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు కోవూరు లో జరిగిన ప్రారంభో త్సవంలో పాల్గొన్న ఆయన హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఇంటింటి కి నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నూతన పథకాన్ని తీసుకొచ్చిందని, ఇందులో భాగంగా ప్రతి నెలలో రెండుసార్లు ప్రతి సచివాలయాన్ని కేంద్రంగా చేసుకుని, వైద్య శిబిరం నిర్వహిస్తారని, కదలలేని వారికి వారి ఇంటివద్దనే చికిత్స, సలహాలు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల పరిషత్ అధ్యక్షులు ఇంటూరి సుశీల మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అద్భుతమైన అవకాశాన్ని, సౌకర్యాన్ని అవసరమైన ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాచవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధి కారి డాక్టర్ స్వాతి, హెవి సుశీల, ఏఎన్ యం ఎస్తేర్ రాణి, సుమతి, యంఎల్ హెచ్ పి లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ లు గోవిందరెడ్డి, శ్రీధర్ బాబు, ఆశా కార్యకర్తలు శోభాకుమారి, రజని పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర -కలువాయి: మండల కేంద్రం అయిన కలవాయి నాయి బ్రాహ్మణ కాలనీ అంగన్వాడి సెంటర్లో "ఫ్యామిలీ ఫిజీషియన్" కేంద్రాన్ని ఎమ్మార్వో పసుపులేటి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ అనే కార్యక్రమా న్ని ప్రభుత్వం ప్రతి ఇంటికి వైద్యుడు, మందులు అందు బాటులో ఉండాలన్న ఆలోచనతో 67 రకాల మందులు, 15 రకాల టెస్టులతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి డాక్టర్ రామ్ కుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్

విశాలాంధ్ర- వలేటీవారిపాలెం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశుపోషకులు ప్రతి ఒక్కరూ తమ పశువులకు వేహించుకోవాలని చుండి సర్పంచ్ ఇరుపని సతీష్ చూసించారు. గురువారం మండలంలోని చుండి గ్రామంలో పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.వి.బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేయిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు ముందుస్తుగా పశువైద్యుల సలహాలు ప్రకారం టీకాలు వేయించాలన్నారు. తద్వారా పశువులను వ్యాధుల బారిన పడకుండా కాపాడు కోవచ్చునన్నారు. మానవ సమాజానికి పశుసంపద ఎన్నో విధాలుగా సహాయపడుతున్నాయని అన్నారు. పశువుల గుర్తింపు కోసం చెవిపోగు వేహించడం ద్వారా రైతులకు ప్రభుత్వపథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. వలేటీవారిపాలెం సహాయసంచాలకులు డాక్టర్ కె.వి. బ్రహ్మయ్య మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుండి పశువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డీసీసెస్-ఎఫ్ఎండీ)నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు.అంటువ్యాధి అయిన ఇది సోకితే పశువుల్లో మరణా లు తక్కువైనా పశువులు బలహీనపడడం,పశువుల్లో పాల ఉత్పత్తులు తగ్గిపోవడం జరుగుతుందని అన్నారు.104నుంచి 106డిగ్రీలు జ్వరం రావడం నోరు,నాలుక వద్ద బొబ్బలు ఏర్పడి మేతమేయకపోవడం, సొంగ కార్చడం,గిట్టల మధ్యపుండ్లు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. వర్షాకాలంలో పరిసరాల, వాతావరణం కలుషితం అవుతుందని తద్వారా పశువులకు వ్యాధులు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు ప్రతిగ్రామంలో ఈ టీకాలు కార్యక్రమం నిర్వహిస్తారని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూసించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఏ లు కిరణ్,తిరున్, రమేష్, ఇరుపని నరసింహం పాల్గొన్నారు.

నవరత్నాల పథకాలతో పెరిగిన తలసరి ఆదాయం

విశాలాంధ్ర-కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ని ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మూడోవ విడత ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళామణులు ఆర్థికంగా అభివృద్ధి చందాలన్నదే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల సాధికారత సాధించేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. కందుకూరు పురపాలక సంఘంలో నీ 893 పొదుపు సంఘాల్లో గల 8483 మంది మహిళలకు రూ 7.36 కోట్లు పైచిలుకు నగదును వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నవరత్నాల ద్వారా పేదలకు ఇల్లు,చేయూత,ఆసరా,విద్యా దీవెన, తదితర సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారన్నారు. వరుసగా మూడవ ఏడాది 'వైయస్ఆర్ ఆసరా', రాష్ట్రవ్యాప్తంగా చితికిపోయిన 7.98 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 78.94 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఊరటనిస్తూ మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మూడవ విడతగా రూ 6,419.89 కోట్లు ఆర్థిక సాయాన్ని జగనన్న ప్రభుత్వం అందించిన అన్నారు. ఇప్పటివరకు వివిధ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు మన జగనన్న ప్రభుత్వం రూ 2,25,330.76 కోట్ల మేర లబ్ధిని చేకూర్చిందన్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా మెప్మా పిడి రవీంద్ర, కమిషనర్ ఎస్ మనోహర్, సిఎంఎం గ్రూపు సభ్యులు వైఎస్ఆర్ సీపీ ముఖ్య నాయకులు గ్రూపు సభ్యులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గృహ సారధులకు అవగాహన

విశాలాంధ్ర-ముత్తుకూరు: 'మా నమ్మకం నీవే జగన్' కార్యక్రమాన్ని ప్రజ ల్లోకి తీసుకెళ్లి ప్రచారం నిర్వ హించే గృహసారధులకు ఈ కార్యక్రమం పై గురువారం మండ లంలోని తాళ్లపూడి సచివాల యంలో పార్టీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, జి జి ఎస్ మండల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ లు గురువారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా నమ్మకం నీవే జగన్ కార్యక్ర మం కింది స్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిం చేందుకు ఇప్పటికే గృహ సారధులను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రచారానికి అవసరమైన మెటీరియల్ కూడా గృహ సారధులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో మామిడిపూడి సర్పంచ్ కాకి మస్తానమ్మ, తాళ్లపూడి ఉపసర్పంచ్ అల్లంపాటి గోపాల్, సచి వాలయ కన్వీనర్ దువ్వూరు హరికృష్ణ, నాయకులు గౌస్ బాషా, గోనెల శ్రీనివాసులు, కోట సుధీర్, వాలంటీర్లు, పంచాయతీ గృహసారథులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సద్వినియోగం చేసుకోవాలి - డాక్టర్ మణిదీపిక

విశాలాంధ్ర- వలేటీవారిపా లెం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టి న ప్యామిలీ ఫిజీషియన్ కార్యక్ర మా న్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని వలేటివారి పాలెం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ మణిదీపిక అన్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభ మైన ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో బాగంగా మండ లంలోని అంక భూపాలపురం గ్రామం లో ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ లో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మణిదీపిక మాట్లాడుతూ ఇంటింటికీ నాణ్యమైన వైద్యసేవలు అందించ డమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నూతన పథకాన్ని తీసుకొని వచ్చిందని దీనిలో భాగంగా ప్రతి సచివాలయంను కేంద్రంగా వైద్యశిబిరం నిర్వహి స్తున్నా మన్నారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులను వాళ్ళ ఇంటివద్దనే పరీక్షించి వైద్యసేవలు అందిస్తామన్నారు. అనంతరం రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శివరామయ్య ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్ పీ,సూపర్వైజర్, హెచ్ ఏ, ఆచాకార్యకర్తలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

విశాలాంధ్ర - ఉలవపాడు : దక్షిణ జాతీయ రహదారిపై భీమవరం అడ్డ రోడ్డు వద్ద గురువారం మోటార్ బైక్ ను ఢీ కొట్టిన బులేరో వాహనం మోటార్ బైక్ నడుపుతున్న వ్యక్తికి తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. కావలి నుండి విజయవాడ వైపు వెళుతున్న బోలెరో వాహనం బైకును ఢీకొట్టడంతో కందుకూరు మండలానికి చెందిన మందూరి శ్రీనివాసరావు కు తీవ్రమైన గాయాలు కావడంతో హైవే పెట్రోలింగ్ పోలీసు వారు ఉటా ఉటీన సంఘటనా స్థలానికి చేరుకుని ఒక ప్రైవేటు వాహనంలో ఉలవపాడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్య నిమిత్తం 108 వాహనం ద్వారా ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి నట్టు ఉలవపాడు ఎస్ఐ తిరువీధుల త్యాగరాజు తెలిపారు.

జగనన్నే మాభవిష్యత్'లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర-కందుకూరు: 9వ సచివాలయంలో జరిగిన కన్వీనర్లు, గృహసారథులు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కందుకూరు పట్టణ జెసియస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇంటి ఇంటికి వెళ్లి వివరించి ప్రజామద్దతు కూడగట్టాలన్నారు. జనార్దన స్వామి దేవాలయం చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం మాట్లాడుతూ మన ఎమ్మెల్యే మహిధర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమానికి కన్వీనర్ దేవరకొండ ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మాట్లాడుతూ సంక్షేమం కొనసాగాలంటే జగన్ సి.ఎం ,మహీధర్ రెడ్డి ఎమ్మెల్యే గా గెలు పొందా లన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు నిడమనూరి.రమేష్, షేక్ హాఫీజ్ చనమాల కోటేశ్వరరావు మాజీ కౌన్సిలర్ కరిమూనిషా ,రాష్ట్ర యువజన కార్యదర్శి గణేషం గంగిరెడ్డి గృహసారథులు, వాలంటీర్లు వార్డులో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వాహనాలు పంపిణీ: మంత్రి కాకాణి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రజలకు పౌష్టికాహారం అందించడంతో పాటు మత్స్య కారులకు ఉపాధి మార్గాలను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మత్స్యకారులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లా డుతూ మత్స్యకారులకు అన్ని విధాల అండగా నిలుస్తూ, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మినీ ఫిష్ అవుట్లెట్లు ఏర్పాటు, మత్స్య సంపదను మార్కెటింగ్ చేసేందుకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మత్స్యకారు లకు మత్స్య సంపదను తరలించుటకు, విక్రయించుటకు వీలుగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద అందజేస్తున్న ఈ వాహనాలు ఎంతో ఉపయోగ పడతా యన్నారు. ఎస్సీ,ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీతో ఈ వాహ నాలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, వారికి అన్ని విధాల తోడ్పాటును ఇవ్వడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తొలుత ద్విచక్ర వాహనాలు 18,ఒక త్రిచక్ర వాహనం, మూడు లైవ్ ఫిష్ వెండింగ్ వాహనాలను మంత్రి చేతుల మీదుగా మత్స్యకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, జడ్పీ సీఈఓ చిరంజీవి, ఏడి ప్రసాద్, మత్స్య శాఖ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్న నాలుగేళ్లు మాట్లాడాల్సింది..

- పబ్లిసిటీ స్టంట్ కోసమే కోటంరెడ్డి దీక్ష
- ఎమ్మెల్యే పై మంత్రి కాకాని సెటైర్లు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి పార్టీ మంచి గౌరవం హోదా కల్పించిందని అయితే అధికారం లో ఉన్న నాలుగేళ్ల పాటు ఆయన పొట్టే పాలెం కలుజు వంటి సమస్యలపై మాట్లాడ కుండా బయటికి వెళ్లిన తర్వాత దాని పై దీక్షకు కూర్చుంటామని చెప్పటం పబ్లిసిటీ స్టంట్ తప్ప ఇంకొకటి కాదని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. నెల్లూరు నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీలో అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి దగ్గర కూర్చొని ఈ సమస్యను పరిష్కరించుకో వాల్సి ఉందని కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదన్నారు. బయటకు వెళ్లి పార్టీపై బురద జల్లటం సబబు కాదన్నారు. ఇది కేవలం ఆయన రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న పబ్లిసిటీ మాత్రమే నని మంత్రి కాకాని అన్నారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు రూరల్ నియోజక వర్గం ఇన్చార్జి, పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి, డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పలువురు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్వ స్పాన్సర్ ఫిష్ ప్రోగ్రాం

విశాలాంధ్ర -మనుబోలు: వెంకటాచలం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ముత్తుకూరు ,మనుబోలు, వెంకటాచలం పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులకు మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సిడిపిఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది ఐసిపిఎస్ సమత, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రమణమ్మ, రంగమ్మ, ఆదినారాయణమ్మ, సీతాలక్ష్మి ,లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలను అణిచి వేస్తే ప్రజలే గుణపాఠం నేర్పుతారు: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దీక్షకు సీపీఎం సంఘీభావం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేస్తున్న దీక్షకు మద్దతుగా సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ జిల్లా కమిటీ సభ్యుడు మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సిఐటియు నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ తో సహా పలువురు సిపిఎం నేతలు సంఘీభావం తెలిపారు. గురువారం నెల్లూరు మాదంట లేఔట్ లోని ఎమ్మెల్యే నివాసంలో వారు ఎమ్మెల్యేని కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మాట్లాడే ప్రతి ఒక్కరిని అణిచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్ని స్తోందని ధ్వజమెత్తారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడంతో ఇండియన్ నేషనల్ లీగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ సమీ ఆధ్వర్యంలో నెల్లూరు మాగుంట లేఔట్ లోని ఆయన నివాసానికి వెళ్లి ఆయనకు సంఘీ భావం తెలిపారు. కోటంరెడ్డి అరెస్టు ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించడమే అన్నారు.

మూడోసారి గెలవనున్న కాకాణి: గుంజిరమేష్

విశాలాంధ్ర-మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ముచ్చటగా మూడోసారి గెలబోతున్నారని సర్వేపల్లి నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్ గుంజి రమేష్ పేర్కొన్నారు.సర్వేపల్లినియోజకవర్గం ప్రజలకు కాకాణిగోవర్ధన్ రెడ్డి ఒక విజన్ విశ్వసనీయత కలిగిన గొప్ప నాయకుడు, రైతు బాంధవుడు, ప్రతి ఇంటి పెద్ద బిడ్డ సర్వేపల్లి ప్రజల పట్ల కాకాణి అన్నకి ఉన్న ప్రేమ వెలకట్టలేనిది, నిరంతరం కృషి, పట్టుదల దృఢ సంకల్పంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాడు, కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. ఇలాంటి ఎమ్మెల్యే, మంత్రి బహుశ ఎవరు చూసి ఉండరని, కాకాణి మాటల్లో కసి పట్టుదల లక్ష్యంపైన ఉన్న గురి సాధించేవరకు నడిపిస్తుందని, అనుకున్నది సాధించాలనే తపన ఉన్న నాయకుడు కనుకే సర్వేపల్లి నియోజక వర్గానికి ఎమ్మెల్యే అయ్యారన్నారు. రాష్ట్రానికి మంత్రి అయ్యారు. ముచ్చటగా మూడోసారి మళ్లీ గెలవబోతున్నారు కాకాని అన్నా మీ పట్టుదల సాధించాలనే కాంక్ష, భవిష్యత్ ని చూసే దూరదృష్టి అత్యంత ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొనేమీ ధైర్యం ఎందరో నిరాశావాదులకు ఆదర్శం అన్నారు. చిన్న చిన్న విషయాలకి సైతం కుంగిపోయే కొంత మంది యువకులకు సామాన్యులకు ఆయన పయనం ఒక పాఠం అన్నారు. 'మీరు వస్తారు.మంచి

చేస్తారు' అని ఎదురు చూసిన సర్వేపల్లి ప్రజలకు ఈరోజు ఏనలేని ఆనందం.. సామాన్యు లకు మీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మం ఒక ఉపశమనం అ న్నారు.

మంత్రి గా బాధ్యతలు స్వీకరించిన నెలల్లోనే..

సర్వేపల్లి నియోజకవర్గం లో మీ విప్లవాత్మక పాలన అందించి ఏళ్లపాటు చెప్పుకునే అంత అభివృద్ధి చేసిచూపించి, అనేక రకాల మంచి కార్యక్రమాలు నిర్వ హించడం మీ మనోధైర్యానికి నిదర్శనం. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని నిలదొక్కుకునే మీ మీ మనో నిబ్బరం చాలామందికి స్ఫూర్తిదాయకం అన్నారుకొంతమంది కడుపు మంటలు, కొంత మంది ఏడుపులు, కొంతమంది హాహాకారాలు చూస్తుంటే సరిలేరూ మీ కెవ్వరూ అనిపిస్తుందన్నారు. మీరు సర్వేపల్లిలో చేసిన, ఇంకా చేయబోతున్న అభివృద్ధిని, మంచిని వివరిస్తామని మీ వెంటే ఉండి అడుగులో అడుగులు వేస్తామన్నారు.